రెండు కళ్ళూ పీకేసి, నాలిక కోసేశాను. ఇక నించి అది చెల్లెలిని ఏమీ అనలేదు.

కత్తి చూడగానే జగ్గ గడగడ లాడిపోయాడు చెల్లీ" అని పకపక నవ్వాడు మను.

"అన్నయ్యా" అని దుర్గ నిట్టూర్పు విడిస్తూ మనుమీద వాలిపోయింది.

మను ఆప్యాయంగా చెల్లెలి తల నిమిరి ముద్దుపెట్టుకొన్నాడు.

"చెల్లీ! మిమ్మల్ని నేనెంత ప్రేమిస్తేనేమి, ఆ గయ్యాళిదాని గుడ్లు పీకినందుకు పోలీసులు నను జైల్లో పెడతారు. అయినా మీ అన్నయ్య ప్రేమని ఆ ఇనుప గజాలుగూడ బంధించలేవు. ఎండకి తెల్లని గొడుగులా, మిమల్ని నా ప్రాణం వున్నంతవరకూ, నేనెక్కడ ఎన్ని చెరసాలల్లో వున్నా కాపాడుతూనే వుంటాను" అని చెల్లెలి ముద్దు ముఖాన్ని ముద్దులాడాడు చెల్లెలు రెండేళ్ళ పసిపాప అనే ఉద్యేశ్యంతోనే.

కథానిక

# లెక్కలొచ్చిన మొద్దబ్బాయి

"సుబ్బన్న"

ఏరికోరి పెట్టిన పేరు హనుమంతరావుకు తగినట్టుగానే ఉంది. వాడు చేసే పనులే గాకుండా ఆకారంకూడా అందుకు తగినట్టే అమిరింది.

వాడి అల్లరిమూలంగా నైతేనేం, సమాజంలో వాడి తండ్రికున్న గౌరవం చేత నైతేనేం, వాడి తాత సంపాదించిన ఆస్తి కారణంగా నైతేనేం, హనుమంతరావు చదువకపోయినా ప్రతి క్లాసు ప్యాసవుతూనే ఉన్నాడు.

ఆ రోజున క్రొత్తగావచ్చిన లెక్కలమేస్టరు వాళ్ళ క్లాసుకొస్తారని హనుమంతరావుకు ముందుగానే తెలిసింది. మేస్టారు క్లాసులోకి వెళ్ళేసరికి వాడో చిన్న ఉపన్యాసం ఇస్తున్నాడు. మేస్టార్ని చూచి బుర్ర గోక్కుంటూ స్వాగతమిచ్చాడు.

'మీ ఊరు, పేరు, రూపు, రంగూ అన్నీ చెప్పేశానండి. మీరిక పాఠం మొదలెట్టవచ్చు.' అనుజ్ఞ ఇచ్చి మొదటి బెంచీ డస్కుమీద కోతిలాగ కూర్చున్నాడు:

పిల్లలంతా నవ్వుతున్నారు.

'అడ్డం లేవోయ్' కేక వేశారు.

'అదేం కూర్చోడం?' మందలించారు.

'చూడండి మేస్టారూ!' ఫిర్యాదుచేశారు.

'ఇటు రావోయ్' ఆహ్వానించారు.

కొత్త మేస్టారు వీటినేమీ పట్టించుకోకుండా నల్లబల్ల తుడిచి, వారిపేరు, ఊరు, వారు చెప్పే విషయాలు వరుసగా వ్రాశారు.

'అవన్నీ నే చెప్పేశానండీ' అన్నాడు హనుమంతరావు.

మళ్ళీ క్లాసులో కలకలం బయలుదేరింది.

మేస్టారు బల్లమీద పెద్దపెద్ద అక్షరాలతో ఏదో వ్రాస్తున్నారు.

కొత్త మేస్టారు జంకులేకుండా నిలబడటం, ఎంత గోలచేసినా లక్ష్యం చెయ్యకుండా ఏదో వ్రాయడం, వాళ్ళు కల్పించినా క్రమశిక్షణమీద చిన్న ఉపన్యాసమైనా దంచకపోవడం-ఇవన్నీ పిల్లలకు క్రొత్తగా ఉన్నాయి. వింతగా ఉంది. నిశ్శబ్దంగా కూర్చున్నారు. మేస్టారు క్లాసును ఒక్కసారి కలియ జూశారు.

హనుమంతరావు నిలబడి 'మొద్దబ్బాయి కూడ లెక్కలు నేర్చుకోగలడు' బోర్డుమీది వ్రాతను బిగ్గరగా చదివాడు.

'అంటే సీగ్గూడా లెక్కలు వస్తాయన్న మాట' వ్యాఖ్యానించాడు శ్రీహరి. అంతా విరగబడి నవ్వేశారు. కొందరు బల్లలు చరిచారు. హనుమంతరావుకు కోపం రాలేదు.

'నిజంగానండీ!' ప్రశ్నించాడు.

'వాడికి వెయ్యి జన్మలెత్తినా రావండి' వెనక బెంచీవారు శిలాశాసనం చదివారు.

'మీకు మహావచ్చు లేవోయ్' తోక ఝాడించాడు హనుమంతరావు.

చిరునవ్వు ముఖంతో నిట్టనిలువుగా నిల్చున్నారు క్రొత్త మేష్టారు. వారి లేత ముఖం సంతోషంగాను గంభీరంగాను ఉంది. పిల్లలంతా ఆశ్చర్యంగా వారి కాంతివంతమైన కళ్ళల్లోకి చూస్తున్నారు.

'పదిహేను పదిహేన్లు ఎంత!' దొండపళ్ళ లాంటి వారి పెదవులు కదిలి తెల్లని పలువరుస కనిపించి మాయమైంది.

ఎనిమిదిమంది నిల్చున్నారు. (ఈ లోగా కాగితంమీద హెచ్చవేసిన) తొమ్మిదవవాడు 'రెండువందల ఇరవై అయిదు' అన్నాడు.

దాన్ని మేష్టారు నల్లబల్లమీద వ్రాసి అందర్నీ కూర్చోమన్నారు.

'ఇరవై ఐదు ఇరవై ఐదులు ఎంత?' రెండో ప్రశ్న వేశాడు.

ఈ ప్రశ్న క్లాసును కదిల్చివేసింది.

'ఎక్కాలు అడుగుతారేమండి?'

'మాకు రావండి.'

'అంత పెద్దవి ఎవరికొస్తాయండి!'

'మీ అందరికీ వచ్చు. అంతకంటె పెద్దవి కూడ వచ్చు. ఐతే మీకు వచ్చినట్లు మీకు తెలియదు. అందుకని రావనుకొంటున్నారు' అన్నారు మేష్టారు.

'అబ్బ! ఇప్పటికి మాట్లాడారు కాస్త' మెల్లిగా గొణిగింది శారద ప్రక్కనున్న సుందరితో.

'మా విషయం ఇప్పుడొచ్చిన మీకేం ఎక్కువ తెలుసే!' ఓ చెణుకు విసిరేశాడు హనుమంతరావు.

క్లాసు గొల్లుమన్నా ఏమీ అనకుండా మేష్టారు కొన్ని గుణకార ఫలితాలను సునాయాసంగా వరుసగా బోర్డుమీద వేసుకుపోతున్నారు.

పిల్లల్లో ఆశ్చర్యమెక్కువైంది. ఆలోచన కలిగింది. అందుకని క్లాసు నిశ్శబ్దంగా ఉంది.

'బట్టీ వేసుకొచ్చారా!'- శారద మెల్లిగా సుందరిని అడిగింది.

'ఏమో!' అన్నది సుందరి.

హనుమంతరావు మేష్టారికి దగ్గరగా వచ్చి నల్లబల్లమీది గుణకారాలను వరుసగా చదివాడు. పైనుంచి క్రిందికి మళ్ళా చూశాడు. ఒక్క నిమిషం ఆగి, కళ్ళు ఆర్పి పెదవి కొరికి:

'ఆ! ఇంక వేసుకోండి. అరవై ఐదు అరవై ఐదులు, నాలుగు వేల రెండువందల ఇరవై ఐదు. డెబ్భైఐదు డెబ్భైఐదులు, ఐదువేల ఆరువందల ఇరవై ఐదు.

ఇదంతా మెస్మరిజం మాదిరిగా ఉంది పిల్లలకి.

'ఇదేదో ఉందే! వీడూ చెప్పేస్తున్నాడు' గొణిగింది శారద.

'తరువాత గుణకారం నీవు చెప్పు?' శారద నడిగారు మేష్టారు.

శారద నిలబడ్డది.

తేలు కుట్టిన వాడిలాగ చేయి విదిలించి వేలు కొరుక్కుని 'నేను చెబుతానండి' అన్నాడు రాజారావు.

సుబ్రమణ్యానికీ శ్రీహరికీ కూడ తెలిసింది ఈ సులభమైన సూత్రం.

'నీవు చెప్పేదేమిటోయ్' అంటూ హనుమంతరావు ఆరంభించాడు: 'ఎనభై అయిదు ఎనభై ఐదులు-ఐదు అట్లా ఉంచు. ఎనిమిదిని దాని తరువాత అంకె తొమ్మిదితో గుణించు. డెబ్భైరెండు. దాని ప్రక్కన ఐదు ఐదులు ఇరవై ఐదు వ్రాయి. అపుడు అది ఏడువేల రెండు వందల ఇరవై ఐదు అవుతుంది. అదే ఆన్సరు.'

ఐదు చివరగల ఏ సంఖ్యనైనా సులువుగా నోటితో వర్గించే మార్గం క్లాసంతకూ తెలియజెప్పాడు హనుమంతరావు.

నలభై జతల కళ్లు మిలమిల మెరిశాయి. నలభై లేత హృదయాలు సంతోషంతో పొంగిపోయినై. వాళ్ళే కనుక్కున్న గణిత సూత్రం వాళ్ళకి బ్రహ్మానందాన్నిచ్చింది.

శారద నిలబడి 'ఔనండి' అన్నది మెరిసే కళ్ళతో.

'ఏమిటి?' అన్నారు మేష్టారు బిగువుగా.

'మొద్దబ్బాయికి కూడ లెక్కలు వస్తాయండి' పాలుగారే లేత బుగ్గలమీద కావిరంగు పరుగులు తీసింది.

'మొద్దమ్మాయిలకీ వస్తాయండి' హనుమంత రావు అందుకొన్నాడు.

'అందువల్ల అందరికీ లెక్కలు వస్తాయి' మేస్టారు ధృవీకరించారు.

అంతా నిండుగా నవ్వుకొన్నారు.

'ఈ రకమైన హెచ్చవేతలు వచ్చినంత మాత్రాన లెక్కలన్నీ వస్తాయండి' శ్రీహరి తిరుగు ప్రశ్న వేశాడు.

'నీకు రాని లెక్కేదో చదువు' అన్నారు మేస్టారు.

తాలూకాఫీసు హెడ్ గుమాస్తాగా పనిచేసే వాళ్ళనాన్న, బి.ఎ. చదివే వాళ్ళఅక్క, వాడూ కలిసి రెండుగంటలసేపు 'ఏ' 'బీ' లతో నాలుగు తావులు పాడుచేసినా అంతుచిక్కని ఎదు రెదురుగా పోయే రెండు రైళ్ళ లెక్కను చది వాడు శ్రీహరి.

మేస్టారు నాలుగు ప్రశ్నలువేసి వాడిచేతనే లెక్కంతా చెప్పించారు.

ప్రశ్నలముందు లెక్క మంచులాగ విడిపో యింది. వెన్నలాగ కరిగిపోయింది. ఏ బీ లు లేకుండానే లెక్క తేలిపోయింది. బడి గంట గణగణ మ్రోగింది.

పిల్లలంతా ఉత్సాహంగా ఆశ్చర్యంతో ఆలోచించుకొంటూ తర్కించుకొంటూ వాదోప వాదనలతో బయటికి వస్తున్నారు.

హనుమంతరావు చెంగున ఎగిరి మేస్టారి దగ్గరగావచ్చి 'మేస్టారూ!...' అన్నాడు. ఆయ నతో బయటికి నడిచాడు. మధ్యలో 'ఏమండీ!' ఏదో ప్రశ్నించబోయి ఆగాడు. గేటుదాకా వెళ్ళి 'మా క్లాసుకే గదండి మీరు?' ఆదుర్దాగా అడిగాడు.

ఏవో ఒక లక్ష ప్రశ్నలు వేస్తామని, మాస్టా రితో రెండు సంవత్సరాలపాటయినా మాట్లాడ దామని వాడికుంది. కాని వేయబోతే ఒక ప్రశ్నా రావడంలేదు. మేస్టార్ని చూస్తూ, కళ్ళు ఆర్పుకొంటూ, ఏదో ఆలోచించుకొంటూ ఇంటికి వెళ్ళాడు హనుమంతరావు.

* * *

'నాన్నా! నాన్నా!! గాలివాన వస్తుంది.'

'పేపర్లో లేదే! రేడియోలో చెప్పారా?'

'కాదు నాన్నయ్యా. అన్నాయి పుస్తకం చేతబట్టి లాంతరు దగ్గర కూర్చున్నాడు.'

'అలాగా! ఐతే గాలివానేం, పెద్ద తుఫానే రావచ్చు.'

'తుఫాను కాదు నాన్నా నాకులెక్కలు వస్తున్నాయి' సమాధానమిచ్చాడు హనుమంత రావు.

# గుంటూరు విద్యార్థుల సమస్యలు

మద్దినేని రాధాకృష్ణమూర్తి

ఆంధ్ర దేశమునందు విద్యావిషయమున ముఖ్య పట్టణమయిన గుంటూరునందు విద్యార్థులు పొందుతూన్న దుస్థితిని తెలుసు కున్నయెడల వారిస్థితికి విచారించని వారుండరు. ఆంధ్రదేశమున మరేపట్టణమునందునూ గుంటూరు నందు నిర్వహింపబడుచున్నన్ని కాలేజీలుగాని, ఉన్నతపాఠశాలలుగాని నిర్వహించబడుటలేదు. ఎ. సి. కాలేజి, హిందూ కాలేజి, మెడికల్ కాలేజి,గవర్నమెంటు స్త్రీల కాలేజీలు యిచ్చట ప్రస్తుతం నిర్వహించబడుతున్నాయి. ఈనాలుగు కాలేజీల యందును దాదాపు నాలుగువేలమంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇక ఉన్నత పాఠశాలలు మిడిల్ స్కూలులు పది వరకూ వున్నాయి. ఇతర ప్రదేశములనుండి గుంటూరుకు వచ్చి కాలేజీలయందుగాని, ఇతర పాఠశాలలయందుగాని, యీ మధ్యనే విపరీత ముగా వెలసిన ట్యుటోరియల్ కాలేజీలయందు గాని, విద్య నభ్యసించుచున్న విద్యార్థుల